సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 22 । జూన్ । 2023



ఆ పంతులమ్మ మా కొద్దు

చిన్నారులను కొట్టి హింసించే ఉపాధ్యాయురాలు మాకు వద్దంటూ కలకడ మండలం ముడియంవారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాల వద్ద నిరసన తెలిపారు. - 8లో



నీరు పుష్కలం.. పెరిగిన భూగర్భజలం

నర్వరాయసాగర్ ప్రాజెక్టులో నాలుగేళ్లుగా నీటిని నిలువ ఉంచుతుండటంతో భూగర్భ జలాలు పెరిగాయి. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.320	రూ.440
రెండోరకం	రూ.230	రూ.310



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1453 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	481	481
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 92.72 కిలోలు

న్యూస్‌రీల్

మహిళా డిగ్రీ కళాశాలలో కొత్తకోర్సు

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ స్పెషల్ ఇంగ్లీషు కోర్సు నూతనంగా ప్రవేశపెట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుబ్బలక్షుమ్మ తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల్లో భాగంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 24వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు.

నవోదయలో 6వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్

రాజంపేట: రాజంపేట మండలం నారమరాజుపల్లె వద్ద ఉన్న జవహర్‌నవోదయ విద్యాలయంలో 2024–2025 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఈమేరకు నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ గీత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాలలో 2023–2024వ సంవత్సరంలో అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు తమ దరఖాస్తులను పూర్తి చేసేందుకు ఆగస్టు 10 వరకు గడువు ఉందన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎన్‌వీఓడీఏవైఏ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.

రిమ్స్ వైస్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ శ్రీనివాసనాయక్



కడప అర్బన్: కడప ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎం. శ్రీనివాస నాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ స్థానంలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డాక్టర్ లక్ష్మీబాయి ఇటీవల కర్నూలు మెడికల్ కళాశాలకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ప్రస్తుతం కడప ఫోరెన్సిక్ విభాగంలో హెచ్‌ఓడీగా పనిచేస్తున్న ఎం. శ్రీనివాసనాయక్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిమ్స్ వైద్య కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

భూసార పరీక్ష కేంద్రం తనిఖీ



భూసార పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయఅధికారి చంద్రనాయక్

మదనపల్లె సిటీ: స్థానిక టమాట మార్కెట్ యార్డులోని భూసారపరీక్ష కేంద్రాన్ని బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తనిఖీ చేశారు. కేంద్రం మరమ్మతులకు అవసరమయ్యే నిధుల ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. గత నాలుగు సంవత్సరాలుగా భూసార పరీక్ష కోసం మట్టి నమూనాలు పరీక్షించకపోడం వల్ల, మట్టి నమూనా యంత్ర సామగ్రి నిరుపయోగంగా మారింది. దీంతో జిల్లా అధికారి పరిశీలించారు. మట్టి నమూనా పరీక్షల నిమిత్తం, వ్యవసాయాధికారితో పాటు ఒక ఎంపీఈఓను నియమించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఆయన వెంట ఏడీఏ శివశంకర్, ఏఓ నాగప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశల నైరుతి!



పదును వర్షం పడగానే విత్తనం వేసేందుకు సిద్ధం చేసిన పొలం

- ఇప్పుడిప్పుడు విస్తరిస్తున్న రుతు పవనాలు
- జిల్లాను పలకరిస్తున్న తొలకరి జల్లులు
- జూన్ మొదటి వారం నుంచే సాధారణంగా విత్తన పనులు ప్రారంభం
- పదును వర్షం పడగానే విత్తనం వేసేందుకు సిద్ధంగా అన్నదాతలు

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లాను నైరుతి పలకరించింది. ఎట్టకేలకు రుతు పవనాల జాడ కనిపించడంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. తొలకరి జల్లులు అలా చిలకరించిన నైరుతి ఒకటి, రెండు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలియజేసింది. గత మూడు నెలలుగా ఎండలతో సతమతమవుతూ ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు తొలకరి జల్లులతో ఎంతో కొంత ఉపశమనం లభించింది. జిల్లా వ్యాప్తంగా మంగళవారం అక్కడక్కడా జల్లులతోపాటు ఓ మోస్తరు వర్షాలు కురిశాయి.

విస్తరిస్తున్న రుతు పవనాలు

ఈ ఏడాది రుతు పవనాల రాక కూడా కాస్త ఆలస్యమై ఎట్టకేలకు ఇప్పుడిప్పుడే జిల్లాలో ప్రభావం కనిపించింది. వేడిమి కారణంగా అల్లాడుతున్న జిల్లా వాసులకు కొంతమేర చల్లని వాతావరణం తోడైంది. జిల్లాలోని కురబలకోట, మదనపల్లె, చిన్నమండెం, గుర్రంకొండ, సంబేపల్లె, గాలివీడు, పీలేరు, తంబళ్లపల్లె ప్రాంతాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసింది. బుధవారం రాత్రి కూడా రాయచోటి పట్టణంతోపాటు పలు మండలాల్లో ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులు కనిపించాయి.

పదును వర్షం కోసం రైతుల ఎదురుచూపులు

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. సాధారణంగా జూన్ 15 నుంచి జులై 15వ తేదీలోపు వేరుశనగ విత్తనానికి మంచి అదునుగా రైతులు భావిస్తారు. అదునులో పదును వర్షం కోసం అన్నదాతలు ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే అన్నదాతలు వేసవి దుక్కులతోపాటు ఇతర సేద్యాలను చేసి సాగుకు భూమిని సిద్ధం చేశారు. ఖరీఫ్ ప్రారంభమైన నేపథ్యంలో నైరుతి ప్రభావంతో భారీ వర్షం కురవడమే ఆలస్యంగా భావిస్తున్నారు.

ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసుకున్న రైతులు

అన్నమయ్య జిల్లాలో పదును వర్షం కురవడమే తరువాయి. జిల్లా వ్యాప్తంగా వేరుశనగ విత్తనం వేసేందుకు అన్నదాతలు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులు సరఫరా చేసిన వేరుశనగ కాయలను కూడా సబ్సిడీపై తీసుకున్న రైతులు విత్తనాలుగా మొలుస్తున్నారు. ఎరువులను కూడా సిద్ధం చేసుకుని రైతన్నలు విత్తనం వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పొలాల్లో ఇప్పటికే ఎరువులను సిద్ధం చేసి విత్తనాలు చల్లేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు.

విత్తనం వేసేందుకు మంచి అదను



జిల్లాలో రైతులకు సబ్సిడీపై ఇప్పటికే 52 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను సరఫరా చేశాము. అలాగే ఆరుతడి పంటలకు సంబంధించిన విత్తనాలు రైతన్నల దరికి చేర్చాం. విత్తనాలతోపాటు ఎరువులనుకూడా అందిస్తున్నాం. జూన్ 15 నుంచి జులై నెలాఖరు వరకు విత్తనం వేసుకోవచ్చు. రైతులు పదును వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం భారీ వర్షం కురిస్తే పొలాల్లో విత్తనం వేసుకోవచ్చు. ఇప్పుడు వర్షం కురిసి విత్తనం వేస్తే మంచి అదునుతోపాటు అనుకున్న మేర దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.

– చంద్రానాయక్, జిల్లా వ్యవసాయాధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా

చుక్కల భూములపై చరిత్రాత్మక నిర్ణయం

- యాజమాన్య హక్కులతో రైతుకు న్యాయం
- సీఎం జగన్‌కు ధన్యవాదాలు
- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష రైతు నేతలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు

కడప సెవెన్‌రోడ్స్: దశాబ్దాలుగా రైతులను వేధిస్తున్న చుక్కల భూముల సమస్యను పరిష్కరించడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మక, సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని పలువురు అఖిలపక్ష రైతు సంఘాల నేతలు కొనియాడారు. చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి యాజమాన్య హక్కులు కల్పించడం ద్వారా రైతులకు న్యాయం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. బుధవారం వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన వైఎస్సార్ కాంగ్రెస్ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ బ్రిటీషు కాలంలో రీ సర్వే సందర్భంగా రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలు అధికారులకు సమర్పించకపోవడం వల్ల ఆర్ఎస్ఆర్‌లో చుక్కలు పెట్టారని పేర్కొన్నారు. ఇందువల్ల అవి ప్రభుత్వ భూములుగా భావిస్తూ క్రయ విక్రయాలకు అవకాశం లేకుండా చేశారన్నారు. చుక్కల భూములు సాగు చేసుకుంటున్న రైతులు తమ పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, వివాహాలు తదితర అవసరాల కోసం వాటిని అమ్ముకోలేక పోయారన్నారు. ఒకవేళ ఎవరైనా అనధికారికంగా విక్రయించాలనుకుంటే తక్కువ ధర లభించేదన్నారు. 2016లో చంద్రబాబు ప్రభుత్వం చుక్కల భూములను నిషేధిత జాబితాలో చేర్చిందని పేర్కొన్నారు. పాదయాత్ర సందర్భంగా జగన్ దృష్టికి రైతులు ఈ సమస్యను తీసుకు వెళ్లారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చుక్కల భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతులకు యాజమాన్య హక్కులు కల్పించారని తెలిపారు. ఇలా జిల్లాలో 31,399 ఎకరాలకు సమస్య తప్పిందని తెలిపారు. భూముల వివరాలను రిజిస్ట్రేషన్ అధికారులకు పంపి క్రయ విక్రయాలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారని వివరించారు. రైతుల పేరిట యాజమాన్య హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

సీఎం నిర్ణయం అభినందనీయం



సుమారు వందేళ్లుగా రైతులు చుక్కల భూముల సమస్య ఎదుర్కొంటున్నారు. నిషేధిత జాబితా నుంచి తొలగించాలంటూ ఉమ్మడి రాష్ట్రంలో మేము పలు ఆందోళనలు నిర్వహించాము. సీఎం వైఎస్ జగన్ చుక్కల భూముల సమస్య పరిష్కరించడం అభినందనీయం. – ఎంవీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, సీపీఐ రైతు సంఘం

చుక్కల చిక్కులు తప్పాయి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ తీసుకున్న నిర్ణయం వల్ల ఎన్నాళ్లుగానో రైతులను పీడిస్తున్న చిక్కులు తప్పాయి. ఇందుకు సీఎం అభినందనీయులు. డీకేటీ భూములు కూడా అమ్ముకోవడానికి, కొనడానికి అవకాశం కల్పించాలి. –జనార్దన్, జిల్లా కార్యదర్శి, భారతీయ కిసాన్ సంఘ్

అన్ని పాఠశాలల్లోనూ డిజిటల్ విద్యాబోధన

డీఈఓ శ్రీరాం పురుషోత్తం



డిజిటల్ విద్యావిధానాన్ని పరిశీలిస్తున్న డీఈఓ పురుషోత్తం

మదనపల్లె సిటీ: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ డిజిటల్ విద్యాబోధన అమలు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరాం పురుషోత్తం తెలిపారు. బుధవారం సాయంత్రం మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న డిజిటల్ విద్యాబోధనా విధానాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్నారు. డిజిటల్ విద్యాబోధనపై ఉపాధ్యాయులకు త్వరలో శిక్షణ ఇస్తామన్నారు. డిజిటల్ విద్యాబోధన వల్ల విద్యార్థులు సులభంగా పాఠాలు అర్థం చేసుకుంటారన్నారు. డీఈఓ వెంట డీవైఈఓ క్రిష్టప్ప, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎం సుబ్బారెడ్డి, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారి చంద్రశేఖర్‌నాయక్, ఉపాధ్యాయులు ఫణీంద్ర, మహమ్మద్‌ఖాన్, షరాఫత్‌అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు



సౌమ్యనాథాలయంలో ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు(రాజంపేట): నందలూరులో సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆలయంలో జరుగుతున్న సన్నాహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సౌమ్యనాథాలయానికి శ్రీవారి లడ్డూ ప్రసాదాలను తెప్పించేందుకు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ద్వారా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆయలంలో శ్రీవారి లడ్డూ కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఎస్వీబీసీ చానల్‌లో నిత్యం స్వామివారి పూజ కైంకర్యాలు, వాహనసేవలు వచ్చేలా విస్తృత ప్రచారం కల్పించాలని కోరామన్నారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, ఆలయ ప్రధాన అర్చకుడు సునీల్ శర్మ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ చీప్ ట్రిక్స్

- ట్విట్టర్ ఖాతాలో అసత్య ప్రచారం
- మైనర్‌బాలుడిపై దాడిని రాజకీయంగా వాడుకున్న వైనం
- ఎమ్మెల్యే అనుచరులంటూ తప్పుడు ప్రచారం

మదనపల్లె : రోజురోజుకీ ప్రజాదరణ కోల్పోతున్న టీడీపీ పబ్లిసిటీ పిచ్చితో ఎంతటి బరితెగింపుకైనా సిద్ధపడుతోంది. అధికార పార్టీ నేతలపై దుష్ప్రచారం చేయడంలో పచ్చ పార్టీ ఎంతకైనా తెగిస్తోంది. మూడురోజుల క్రితం మదనపల్లె మండలంలో ఓ మైనర్ బాలుడిపై అతడి స్నేహితులు దాడికి పాల్పడితే.. ఆ ఘటనను సైతం టీడీపీ తనకు అనుకూలంగా మార్చుకునే క్రమంలో కుల ప్రస్తావన తీసుకువచ్చి ఎమ్మెల్యే అనుచరులు దాడి చేశారంటూ సోషల్ మీడియా ట్విట్టర్‌లో తప్పుడు ప్రచారాన్ని మొదలెట్టింది. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి ఉన్న ప్రతిష్టను, క్యాడర్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసేందుకు ఇలాంటి చీప్‌ట్రిక్కులను ప్రయోగిస్తోంది. ఘటనకు సంబంధించిన వివరాలు..

పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన వెంకటరమణ, అంజలి దంపతుల కుమారుడు ఆదిరామమూర్తి(17) ప్రశాంత్‌నగర్‌లోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఇతడు అదే కాలనీకి చెందిన ప్రవీణ్‌కుమార్‌తో గొడవపడ్డాడు. దీన్ని మనసులో పెట్టుకున్న ప్రవీణ్ ఈనెల 17న ఆదిరామమూర్తిని సీటీఎంలో స్నేహితులు జరుపుతున్న తన పుట్టినరోజు వేడుకలకు రావాల్సిందిగా కోరాడు. తన ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని తీసుకువెళ్లాడు. అక్కడ ప్రవీణ్‌తో పాటుగా మదనపల్లె రామారావుకాలనీకి చెందిన రక్షిత్, చందూ, సీటీఎం నేతాజీకాలనీకి చెందిన నౌషాద్, హేమంత్‌బాబులు కలిసి ఆదిరామమూర్తిపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. తాము కొడుతున్న దృశ్యాలను వీడియోలో చిత్రీకరించారు. ఈ ఘటనపై బాధితుడు తాలూకా పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా తనను పట్టించుకోలేదంటూ 19న మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో తల్లిదండ్రులతో కలిసి విలేకరుల సమావేశంలో చెప్పాడు. తమకు న్యాయం జరగకపోతే వడ్డెరసంఘం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతామని హెచ్చరించారు. మరుసటిరోజు పత్రికల్లో ఈ విషయమై వార్తలు రావడంతో స్పందించిన తాలూకా పోలీసులు దాడికి పాల్పడిన నిందితులపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. అయితే ఈ సంఘటనను టీడీపీకి చెందిన నాయకులు తమకు అనుకూలంగా వడ్డెర కులానికి చెందిన మైనర్‌బాలుడిపై ఎమ్మెల్యే అనుచరులు అమానుషంగా దాడికి పాల్పడ్డారంటూ తెలుగుదేశం పార్టీ జై టీడీపీ ట్విట్టర్ అకౌంట్లో వీడియోను పోస్ట్‌చేసి అసత్యప్రచారానికి పూనుకున్నారు. ఘటనలో పాల్గొన్న మైనర్ బాలురు సాధారణ దినసరికూలీ, కార్మిక కుటుంబాలకు చెందిన వారు. వీరికి రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదు. మైనర్‌బాలురకు, వారి కుటుంబాలకు రాజకీయాలతో కానీ పార్టీలతో కానీ ఎలాంటి సంబంధం లేకున్నా... జరిగిన ఘటనకు ఏమాత్రం సంబంధంలేని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అనుచరులను బాధ్యులను చేస్తూ టీడీపీ నీచ,కుట్ర రాజకీయాలు చేయడం సిగ్గుచేటని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇలాంటి చీప్‌ట్రిక్స్ మానుకోకపోతే భవిష్యత్తులో టీడీపీకి తీవ్ర నష్టం తప్పదని, పచ్చపార్టీ నాయకులే బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు.



తెలుగుదేశం పార్టీ ట్విట్టర్ అకౌంట్‌లో అసత్యప్రచారం

జగనన్నకు చెబుదాం ప్రాధాన్యత గుర్తించండి

- పాత స్పందనకు, ప్రస్తుత కార్యక్రమానికి తేడా ఉంది
- ప్రజలు ముఖ్యమంత్రికి సమస్య చెబుతున్నారని గ్రహించాలి
- సమస్య పరిష్కారంపై అర్జీదారుడు సంతృప్తి చెందేలా ఉండాలి
- అర్జీలను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు
- సమీక్షా సమావేశంలో జిల్లా స్పెషల్ ఆఫీసర్ అహ్మద్‌బాబు



జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారంపై ఆర్డీఓ, తహసీల్దార్‌కు సూచనలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ అహ్మద్‌బాబు

మదనపల్లె : రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమ ప్రాధాన్యతను ప్రభుత్వ అధికారులు గుర్తించాలని, ప్రజలు తమ సమస్యలను నేరుగా ముఖ్యమంత్రికే చెబుతున్నారన్న విషయం అర్థం చేసుకోవాలని ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ఎండీ, జిల్లా స్పెషల్ ఆఫీసర్ అహ్మద్‌బాబు అన్నారు. బుధవారం మదనపల్లె సబ్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం అర్జీలకు సంబంధించి కలెక్టర్ గిరీషా పీఎస్‌తో కలిసి వివిధ ప్రభుత్వశాఖల జిల్లాస్థాయి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ అహ్మద్‌బాబు మాట్లాడుతూ ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి నిర్దేశించిన జగనన్నకు చెబుదాం అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. మే27 నుంచి జూన్ 20 వరకు మొత్తం 1,128 అర్జీలు పరిష్కరిస్తే... అందులో 576 ఇన్ ప్రోగ్రెస్, 552 రిడ్రసల్‌లో ఉన్నాయన్నారు. బాధితుల అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమ ప్రగతిపై ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారన్నారు. దీనిని సాధారణ కార్యక్రమంలా పరిగణించవద్దని, ప్రతి అధికారి బాధ్యతతో పారదర్శకంగా పనిచేసినప్పుడే ఆశించిన ఫలితం వస్తుందన్నారు. పాత స్పందనకు, ప్రస్తుత జగనన్నకు చెబుదాంకు చాలా తేడా ఉందని, అధికారులు ఈ విషయాన్ని గ్రహించి పనిచేయకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మ్యుటేషన్, ఆర్వోఆర్, పాసుపుస్తకాలకు సంబంధించి రెవెన్యూ అధికారులు నేటికీ ప్రజలను ఇబ్బందులు పెడుతూనే ఉన్నారన్నారు. సర్వే సమస్యలపై అధిక ఫిర్యాదులు అందిన నేపథ్యంలో సచివాలయ వ్యవస్థతో పూర్తిస్థాయి సర్వేయర్లు అందుబాటులో ఉన్నప్పటికీ ఎఫ్–లైన్ పిటిషన్ కింద బౌండరీలు చూపించేందుకు రోజుల తరబడి సమయం తీసుకోవడమెందుకని ఏడీ జయరాజ్‌ను ప్రశ్నించారు. అర్జీదారుడికి రఫ్ స్కెచ్ ఇచ్చి సమస్య పరిష్కారమయిందని ఎలా చెబుతారని రెవెన్యూ, సర్వేశాఖల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ఎల్ఏ లోపల చేయని పనులు చేసినట్లు చూపుతున్నారని, చేసినదే అందులో రాయాలని, అర్జీదారుడి సమస్య పరిష్కారమయ్యాకే ఎండార్స్ ఇవ్వాలని, రిమార్క్స్ కాలంలో తిరస్కరణకు కారణాన్ని తెలుగులో టైపుచేసి ఇవ్వాలన్నారు. కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ.. నిర్ణీత కాలవ్యవధిలోపు సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. జిల్లాలోని ప్రతి అధికారి సంతృప్త స్థాయిలో వినతుల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఫిర్యాదులపై సంబంధిత శాఖల అధికారులు కిందిస్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించి ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గంగాధరరావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మదనపల్లె, రాయచోటి ఆర్డీఓలు మురళీ, రంగస్వామి, డీపీఓ ధనలక్ష్మి, జిల్లావైద్యాధికారి కొండయ్య, హౌసింగ్ పీడీ శివయ్య, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి సి.గురుప్రకాష్‌రావు, డీఎస్పీ కేశప్ప, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారికే సమాచారం ఇవ్వలేకపోతే... ప్రజలకు ఏం ఇస్తారు!

సచివాలయ ఆకస్మిక తనిఖీలో స్పెషల్ ఆఫీసర్ అహ్మద్‌బాబు



బసినికొండ-1 సచివాలయంలో సర్వేయర్‌ను ప్రశ్నిస్తున్న జిల్లా స్పెషల్ ఆఫీసర్ అహ్మద్‌బాబు

మదనపల్లె : సచివాలయంలో అధికారి అడిగిన సమాచారం ఇచ్చేందుకే సిబ్బంది ఇబ్బంది పడితే... సామాన్య ప్రజలకు ఏం న్యాయం చేస్తారంటూ ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ఎండీ, జిల్లా స్పెషల్ ఆఫీసర్ అహ్మద్‌బాబు ప్రశ్నించారు. బుధవారం బసినికొండ-1 గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది 9 మందికి 5 మంది మాత్రమే ఉండటం గమనించారు. అర్జీల పరిష్కారంపై వివరాలు చూపాలని కోరితే..2020 డిసెంబర్‌లో ఇచ్చిన అర్జీ బియాండ్ ఎస్ఎల్ఆర్‌లో ఉండటం, దాదాపు 246 అర్జీలు అపరిష్కృతంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. ఎక్కువ అర్జీలు రిజెక్ట్ చేయడంపై కారణాలు తెలపాలన్నారు. నోటీసుబోర్డులో సోషియల్ ఆడిట్, లబ్ధిదారుల జాబితా వివరాలు గత ఏడాదికి సంబంధించినవే ఉండటంపై నిలదీశారు. పట్టణానికి కిలోమీటరు దూరంలో ఉన్న సచివాలయంలో పరిస్థితి ఇలా ఉంటే ఎలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సర్వేయర్ జనవరి నుంచి ఇప్పటివరకు సర్వేకు సంబంధించి వివరాలు నమోదుచేయకపోవడంపై మందలించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సచివాలయాలు ఏర్పాటుచేస్తే ఇలాంటి పనితీరు కనబరచడమేంటని అసంతృప్తి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం ఎస్‌బీఐ కాలనీలోని వార్డు సచివాలయం, రామారావుకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం, అర్బన్ హెల్త్ ప్రైమరీ సెంటర్‌ను జిల్లాకలెక్టర్‌తో కలిసి తనిఖీ చేశారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీఓ మురళీ, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, సీడీపీఓ సుజాత, సర్పంచ్ వెంకటరమణ, వైస్‌సర్పంచ్ బావాజాన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాముకాటుతో మహిళా రైతుకు అస్వస్థత

మదనపల్లె : పాముకాటుతో మహిళా రైతు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన మదనపల్లె మండలంలో జరిగింది. పోతబోలు పంచాయతీ పాలెంకొండకు చెందిన నారాయణ భార్య హేమావతి పశుగ్రాసం తెచ్చేందుకు పొలం వద్దకు వెళ్లింది. పశువుల గడ్డి కోస్తుండగా ఆకస్మాత్తుగా పాము కాటేసింది. దీంతో ఆమె అస్వస్థతకు గురికాగా గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకు డాక్టర్ల సూచనల మేరకు తిరుపతికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని దుప్పి మృతి



రామాపురం : మండల పరిధిలోని కసిరెడ్డిగారి పల్లె పంచాయితీ ఎల్లారెడ్డి కంకర మిషన్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీ కొని పొడదుప్పి అక్కడిక్కడే మృతిచెందినట్లు ఫారెస్టు సెక్షన్ అధికారి రెడ్డప్ప తెలిపారు. పాలకొండలో నుంచి గ్రామ సమీపంలోని పంట పొలాల్లో పొడదుప్పి ఉండగా కుక్కలు తరిమాయి. దీంతో రోడ్డుపైకి వచ్చి ప్రమాదానికి గురైందని చెప్పారు. గువ్వలచెరువు పశువుల వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం ఫారెస్టు శాఖ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడితో ఎస్ఈబీ అధికారులు

మదనపల్లె : కర్ణాటక మద్యం విక్రయిస్తున్న సుధాకర్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రశాంత్‌నగర్ బోర్డు సమీపంలో సుధాకర్ ద్విచక్రవాహనంపై తిరుగుతూ కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో నిఘా ఉంచి అదుపులోకి తీసుకున్నామన్నారు. సుధాకర్ నుంచి 12 ఓల్డ్ అడ్మిరల్ బ్రాండ్ టెట్రా ప్యాకెట్లు, హీరోహోండా సీడీ100 డీలక్స్ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం అతన్ని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఇదిలాఉండగా పట్టణంలో జరుగుతున్న కర్నాటక మద్యం విక్రయాల్లో కొందరు సిబ్బంది ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరపాల్సిన అవసరం ఉంది.

నీరు పుష్కలం.. పెరిగిన భూగర్భజలం

- రైతన్నకు వెన్నుదన్ను సర్వరాయసాగర్ ప్రాజెక్ట
- మూడు పంటలు పండించేందుకు అవకాశం
- 90 శాతం పనులు పూర్తి



నీటితో కళ కళలాడుతున్న సర్వరాయ సాగర్

వీరపునాయునిపల్లె : కరువుతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కలలు కన్నారు.జలయజ్ఞం పేరుతో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సంకల్పించారు. ఫలాలు అందుతాయని ఆశించిన తరుణంలో ఆయన ఆకస్మిక మరణం అశనిపాతంలా మారింది. తండ్రి స్వప్నం సాకారం చేసేందుకు తనయుడు సీఎం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపారు.రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న వైఎస్సార్ జిల్లా వీరపనాయునిపల్లె మండలంలోని సర్వరాయసాగర్ ప్రాజెక్టు పనులను 90శాతం పూర్తి చేశారు. కేవలం రివిట్‌మెంటు పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 3.06 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1 టీఎంసీ నీటిని ప్రాజెక్టులో నిల్వ ఉంచుతున్నారు. మిగిలిన 10శాతం పూర్తయితే 100 శాతం నీటిని నిల్వ ఉంచేందుకు వీలుంటుంది. ప్రాజెక్టులో నాలుగు సంవత్సరాలుగా నీటిని నిలువ ఉంచుతుండటంతో భూగర్భ జలాలు పెరిగాయి. బోరు బావుల్లో నీరు అధికమవడంతో రైతులు పంటలు సాగుకు ఉత్సాహం చూపుతున్నారు. గతంలో వర్షాధార పంటల సాగు చేసే రైతులు ప్రస్తుతం బోర్లు వేసి రెండు లేదా మూడు పంటలు పండిస్తుండటం విశేషం. నీరు పుష్కలంగా ఉండటంతో మండలంలోని అన్ని గ్రామాల్లో తోటలు సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. గతంలో చీనీ నిమ్మ సాగు చేసిన రైతులు ట్రాక్టర్లతో నీటిని సరఫరా చేసి పంటలను కాపాడుకొనేవారు. ప్రస్తుతం నీరు సమృద్ధిగా ఉండటంతో అటువంటి పరిస్థితి లేదు.

మరో కోనసీమగా మారనున్న వీరపునాయునిపల్లె

వీరపునాయునిపల్లె మండలం మరో కోనసీమను తలపించనుంది. ఎంతో కాలంగా ముళ్ల పొదలతో నిండి పోయి నిరుపయోగంగా ఉన్న భూములు ప్రస్తుతం సాగులోకి వస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం సర్వరాయ సాగర్ ప్రాజెక్టు. ఏ గ్రామంలో చూసినా ఇప్పటికే అరటి, చీనీ నిమ్మ, సన్న నిమ్మ, బొప్పాయి, మామిడి పంట పొలాలతో పచ్చగా దర్శనమిస్తున్నాయి. పంట కాలువలు పూర్తయితే పచ్చదనానికి మారు పేరుగా వీరపునాయునిపల్లె మండలం నిలవనుంది,

ఆయకట్టు పెరుగుతుంది

సర్వరాయ సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కుడి,ఎడమ కాలువల ద్వారా 25వేల ఎకరాలకు సాగు నీరు అందించేందు వీలుంటుందని అధికారులు అంచనా వేశారు. కానీ నులు పూర్తిస్థాయిలో పూర్తయిన తరువాత ఆయకట్టు మరింత పెరిగేందుకు వీలుంటుంది.

నాలుగు సంవత్సరాలుగా కుడి కాలువ ద్వారా పొలాలలకు నీరు అందిస్తున్నారు. కాలువకు ఇరువైపులా పొలాలు ఉన్న రైతులు రెండు పంటలు పండిస్తున్నారు. సంగాలపల్లె, ఇందుకూరు, గంగిరెడ్డిపల్లె, అనిమెల గ్రామాలకు చెందిన కొంత మంది రైతులకు ప్రస్తుతం కుడి కాలువ వెన్ను దన్నుగా నిలుస్తోంది.

పంట కాలువలను త్వరలో పూర్తి చేస్తాం



ప్రధాన కాలువలకు సంబంధించిన పనులు, పంట కాలువల పనులు త్వరలో పూర్తి చేస్తాం. పంటల కాలువలకు కాలువలకు సంబంధించి భూ సేకరణ దాదాపు పూర్తయింది. 2024లో పంట కాలువలు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఉంది ప్రతి ఎకరాకు నీరు అందించేందుకు కృషి చేస్తాం. ఎడమ కాలువ 9.35కిలో మీటర్లకు గాను 8కిలో మీటర్లు, కుడి కాలువ 16.65కిలోమీటర్లకు గాను 9కిలో మీటర్లు పూర్తి చేశాం.

– సాయిరామ్ ప్రసాద్, (సర్వరాయ సాగర్ ప్రాజెక్టు ఈఈ

రైతులకు దన్నుగా నిలుస్తున్న సర్వరాయ సాగర్



సర్వరాయసాగర్ ప్రాజెక్టు రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. గతంలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో ఎన్ని బోర్లు వేసినా నీరు ఉండేది కాదు. ప్రస్తుతం ఎక్కడ బోరు వేసినా నీరు పుష్కలంగా వస్తున్నాయి. నేడు రెండు పంటలు పండించుకుంటున్నాం. ఇదంతా మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చలువ. ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి.

– శ్రీనివాసులురెడ్డి, రైతు, గంగిరెడ్డిపల్లె

యువకుడిపై ప్రియురాలి తల్లి దాడి



చికిత్స పొందుతున్న రెడ్డిప్రసాద్

కురబలకోట : యువకుడిపై ప్రియురాలి తల్లి కొడవలితో దాడి చేసిన సంఘటన బుధవారం కురబలకోట మండలంలో చోటుచేసుకుంది. రూరల్ సర్కిల్ సీఐ శివాంజనేయులు కథనం మేరకు..మండలంలోని అంగళ్లు దగ్గరున్న చేనేతనగర్‌లో పి. రెడ్డి ప్రసాద్ (24) ప్రైవేటు డ్రైవర్‌గా ఉంటూ మరో వైపు డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇతని ఇంటి దగ్గరే మరో ముస్లిం యువతి (17) ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటోంది. సంవత్సరంగా పరస్పరం ప్రేమలో పడ్డారు. ఈ విషయం ఇద్దరి ఇళ్లలో కూడా తెలుసు. ఇటీవల రెడ్డిప్రసాద్ కుటుంబీకులు ప్రియురాలి ఇంటికి వెళ్లి పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చారు. మతం మార్చుకుంటే తమ కుమార్తె మేజర్ అయ్యాక పెళ్లి చేస్తామని ప్రియురాలి తల్లి రెహానా (45) చెప్పింది. తొలుత వారు ఒప్పుకున్నా తర్వాత మతం మారడం వద్దనుకున్నారు. దీంతో బుధవారం రెడ్డి ప్రసాద్ మరోసారి అదే వీధిలో వస్తున్న రెహానాతో పెళ్లి ప్రస్తావన తెచ్చాడు. దీంతో వారి మధ్య వివాదం కాస్తా గొడవకు దారి తీసింది. దీంతో కోపంతో ఇంట్లోకి వెళ్లి కొడవలి తీసుకుని రెడ్డి ప్రసాద్‌పై రెహెనా దాడికి పాల్పడింది. అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా దాడికి పాల్పడ్డ రెహానాపై హత్యాయత్నం కేసుతో పాటు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి



వెంకటరమణ (ఫైల్)

గుర్రంకొండ : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని నడిమికండ్రిగ పంచాయతీ మొటుకు క్రాస్ వద్ద జరిగింది. పంచాయతీ పరిధిలోని కొత్తపల్లెకు చెందిన కంబాల వెంకటరమణ(65) మంగళవారం పని నిమిత్తం గుర్రంకొండకు వచ్చాడు. తిరిగి బస్సులో స్వగ్రామానికి బయలు దేరాడు. మొటుకు క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్రంకొండ నుంచి రాయచోటి వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం వెంకటరమణను ఢీకొంది. అతను అక్కడికక్కడే మృతి చెందాడు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

24 నుంచి సీపీఐ శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈనెల 24,25,26 తేదీల్లో జిల్లాలోని వీరపునాయునిపల్లెలో సీపీఐ జిల్లాస్థాయి శిక్షణ తరగతుల నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. బుధవారం కడపలోని హోచిమన్ భవన్‌లో మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో సీపీఐ అగ్ర భాగాన నిలిచి పోరాటాలు చేసిందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయీకరణ, భూ సంస్కరణల చట్టం అమలు కోసం పట్టుబట్టి సాధించి ప్రభుత్వ రంగ సంస్థలను నెలకొల్పేందుకు పోరాటాలు చేసినట్లు చెప్పారు.దేశంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను విస్మరించి నిరంకుశ పాలన చేస్తున్నారని తెలిపారు.రాష్ట్రానికి ప్రత్యేకహోదా, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరానికి నిధులు, జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు తదితర అంశాల గురించి పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆంజనేయులు, వెంకటశివ, కేసీ బాదుల్లా, విజయలోకమ్మ తదితతరులు పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రతిభ



కె.హర్షిత్ టీపీ.రాజ్‌ప్రియన్ జె.శశాంక్ బి.చందుప్రజ్వల్ జి.కార్తిక పి.జ్ఞానేంద్రరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : జాతీయ స్థాయిలో 2023–2024 విద్యా సంవత్సరానికి జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి, ఈ ఫలితాల్లో కే.హర్షిత్, వి.చందు ప్రజ్వల్, జీ.కార్తీక, బి.హేమంత్ కుమార్, పీ.జ్ఞానేంద్ర రెడ్డి, ఎం.తీర్థ, టి.పీ.రాజ్ ప్రియన్, జే.శశాంక్, ప్రణీత్‌తో పాటు మొత్తం 42 మంది తమ విద్యార్థులు సీట్లు సాధించారని ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 33 ఏళ్లుగా జాతీయ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలకు తమ సంస్థలో శిక్షణ తీసుకున్న విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలతో పాటు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులను సాధిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీలు అభినందించారు.

సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి



వ్యక్తిత్వ వికాస పుస్తకాలను కేడెట్స్‌కు అందజేస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ తాపా

కడప స్పోర్ట్స్ : విద్యార్థులు సామాజిక అంశాల పట్ల అవగాహన పెంపొందిచుకోవాలని 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా సూచించారు. కడప నగరం తెలుగుగంగ కాలనీలో నిర్వహిస్తున్న కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో బుధవారం స్టెప్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం–కెరీర్ గైడెన్స్, సైబర్ క్రైమ్, దిశాయాప్, మహిళల అక్రమ రవాణాతదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో భాగంగా ఎన్‌సీసీ కేడెట్స్‌కు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా మైనార్టీ కార్పొరేషన్ ఈడీ, పోటీపరీక్షల నిపుణుడు డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధనకు ప్రణాళికాబద్ధంగా శ్రమించాలన్నారు. సాంకేతికతను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే సగం విజయం సాధించినట్లేనన్నారు. స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ మాట్లాడుతూ పదోతరగతి తర్వాత విద్యార్థులకు ఉన్న విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. అనంతరం నిర్వహించిన మరో సదస్సులో కడప పట్టణ క్రైమ్ సీఐ శ్రీధర్‌నాయుడు మాట్లాడుతూ సైబర్ నేరాలపై కేడెట్స్‌కు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐలు మధుమల్లేష్‌రెడ్డి, లక్ష్మీదేవి, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, వి.వి. నారాయణ, నాగశ్రీను, ఎన్‌సీసీ అధికారులు, కేడెట్స్ పాల్గొన్నారు.

పెప్సీ గోడౌన్‌పై ఆకతాయిల దాడి

వాహనాలు, గోడలు, ఫర్నీచర్ ధ్వంసం



విచారణ చేస్తున్న చిన్నచౌక్ పోలీసులు

కడప అర్బన్ (వైఎస్సార్‌జిల్లా): కడపలోని కొండాయపల్లె సమీపంలో ఉన్న పెప్సీగోడౌన్‌పై ఈనెల 19వ తేదీ సాయంత్రం కొందరు ఆకతాయిలు ద్విచక్రవాహనాలపై కర్రలతో వెళ్లి దాడి చేశారు. ఈ దాడిలో కారు, ఇతర వాహనాల అద్దాలను పగులగొట్టారు. ఈ సంఘటనలో ఓ టీవీ ఛానెల్ టౌన్ విలేకరి (సాక్షి టీవీ కాదు) కీలకపాత్రను పోషించాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ దర్యాప్తు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం, పోలీసుల ప్రాథమిక సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొండాయపల్లె సమీపంలో 84 సెంట్ల విస్తీర్ణంలో పెప్సీ గోడౌన్‌ను ఏర్పాటు చేశారు. ఈ గోడౌన్‌కు సంబంధించిన స్థిరాస్తి వ్యవహారంపై రామయ్య నాయుడు, వెంకటేశ్వర్ నాయుడు అనే రెండు కుటుంబాల మధ్య కోర్టులో నడుస్తోంది. చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. గోడౌన్ నిర్వాహకుడు చెన్నూరుకు చెందిన గోగుల కృష్ణయ్య బాడుగను ఈ స్థిరాస్తి వివాదంలోని ఒకవైపు ఉన్న రామయ్యనాయుడుకు చెల్లిస్తున్నాడు. వెంకటేశ్వర్ నాయుడు తరపున ఓ టీవీ ఛానెల్‌కు చెందిన కడప టౌన్ విలేకరి కొంతమంది యువకులను కూడగట్టుకుని, గోడౌన్‌పైకి దాడికి పంపించాడు. దాదాపు 20 నుంచి 30 మంది సంఘటన స్థలానికి చేరుకుని అక్కడ కారు అద్దాలను, ఇతర వాహనాలను ధ్వంసం చేశారు. పెప్సీ గోడౌన్‌లోని కూల్‌డ్రింక్ సీసాలను పగులగొట్టారు. గోడౌన్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చేలోపు కొందరు పరారయ్యారు. తరువాత బాధితులు నేరుగా జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ ప్రత్యేకంగా విచారించి దర్యాప్తు చేపట్టాలనీ కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్‌ను ఆదేశించారు. 16 మంది మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామనీ డీఎస్పీ తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన శ్యామ్‌కుమార్

సిద్దవటం : కడప–చెన్నై ప్రధాన రహదారిలో బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో కడప నగర పరిధిలోని చెలమారెడ్డిపల్లె గ్రామానికి చెందిన శ్యామ్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దవటం మండల శివారులోని జేఎంజే కళాశాల వద్ద బుధవారం ద్విచక్ర వాహన దారుడు కడప నుంచి భాకరాపేటకు వస్తున్నాడు.భాకరాపేట గ్రామ సమీపం లోని హెచ్‌పీసీఎల్ నుంచి ఆయిల్ ట్యాంకర్ లోడుతో నంద్యాలకు వెళుతోంది. జేఎంజే కళాశాల వద్ద ఆయిల్‌ట్యాంకర్ బైక్‌లో వెళుతున్న శ్యామ్‌కుమార్‌ను ఢీకొంది. దీంతో అతని కాలు విరిగింది. చికిత్సకోసం 108 వాహన సిబ్బంది కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. శ్యామ్‌కుమార్ ఆటోడ్రైవర్ గా పనిచేస్తున్నట్లు తెలిపారు.

ఆ పంతులమ్మ మా కొద్దు : పాఠశాలకు తాళం వేసి నిరసన



ముడియంవారిపల్లె పాఠశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన

కలకడ : చిన్నారులను కొట్టి హింసించే ఉపాధ్యాయురాలు మాకు వద్దంటూ కలకడ మండలం, ముడియంవారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సర్పంచ్ బుధవారం పాఠశాల గేట్‌కు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తుల కథనంమేరకు వివరాలిలాఉన్నాయి. మండలంలోని ముడియంవారిపల్లె ప్రభుత్వ ప్రాథిమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న ఎం.నాగలక్ష్మమ్మ విద్యార్థుల పట్ల కఠినంగా వ్యవహరించడంతో నాలుగు నెలల క్రితం సర్పంచ్ శాంతమ్మ, పాఠశాల విద్యాకమిటీ ఫిర్యాదు మేరకు పూర్వ జిల్లా విద్యాశాఖ అధికారి విచారణ జరిపారు. వాస్తవాలు తెలియడంతో నాలుగు నెలలపాటు సస్పెండ్‌చేశారు అనంతరం డిప్యూటేషన్‌పై కేవీపల్లె మండలానికి కేటాయించారు. డిప్యూటేషన్ గడువు పూర్తి కావడంతో తిరిగి ముడియంవారిపల్లె పాఠశాలలో విధులకు హాజరైన ఉపాధ్యాయురాలు నాగలక్ష్మమ్మను మా పాఠశాలకు రావద్దు అంటూ బుధవారం పంచాయతీ సర్పంచ్ శాంతమ్మ, పాఠశాల విద్యాకమిటీసభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు కలిసి పాఠశాలకు తాళంవేసి నిరసన తెలిపారు. అక్కడికి చేరుకున్న మండలవిద్యాశాఖ అధికారి మునీంద్రనాయక్ ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతానని హామీ ఇచ్చినా విద్యార్థులు పాఠశాలకు హాజరు కాలేదు. దీనిపై ఎంఈఓ వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వివాహిత ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన మదనపల్లె మండలంలో బుధవారం జరిగింది. వేంపల్లె పంచాయతీ నల్లగుట్టపల్లెకు చెందిన మురళి భార్య చందన (28) కుటుంబ సమస్యల కారణంగా భర్తపై అలిగి మనస్థాపంతో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానిక వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు.

బైక్‌లు ఢీ : డిగ్రీ విద్యార్థి దుర్మరణం





సంఘటన స్థలంలో ద్విచక్రవాహనాలు (ఇన్‌సెట్) వెంకటసాయి మృతదేహం

కడప అర్బన్ : కడప బాలాజీనగర్‌లోని ఎస్వీడీసీ కళాశాలకు వెళుతున్న రహదారిలో మంగళవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బత్తిన వెంకటసాయి (20) అనే డిగ్రీ విద్యార్థి దుర్మరణం చెందాడు. మరో యువకుడు తేజ స్వల్పంగా గాయపడ్డాడు. వైఎస్సార్ జిల్లా కడప తాలూకా ఎస్ఐ రామకృష్ణ, బంధువుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఊటుకూరులో నివాసం ఉంటూ, ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తున్న వెంకటసుబ్బయ్య, రమాదేవిలకు ముగ్గురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలు, తరువాత వెంకటసాయి కుమారుడు ఉన్నారు. ఇతను కడపలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. ఈనెల 20వ తేదీ రాత్రి స్నేహితుడు తేజతో కలిసి వైవీస్ట్రీట్‌కు స్కూటీలో వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళుతుండగా సంఘటన స్థలానికి చేరుకునేసరికి ఎదురుగా వేగంగా ద్విచక్రవాహనంపై వచ్చి వీరిని ఢీకొంది. వెంటనే స్థానికులు గుర్తించి 108కు ఫోన్ చేశారు. 108లో రిమ్స్‌కు చేరుకోగానే కొంతసేపటికి వెంకటసాయి మృతి చెందాడు.తేజకు స్వల్ప గాయాలయ్యాయి. మరో బైక్‌లోని వారు రిమ్స్‌లో ప్రాథమిక చికిత్స చేయించుకుని పరారయ్యారు. ఈ సంఘటనపై ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

గాలివానకు దెబ్బతిన్న పంటలు



వి.కొత్తపల్లెలో గాలులకు లేచిపోయిన ఇంటి పైకప్పు రేకులు



అరటి పంటను పరిశీలిస్తున్న హెచ్ఓ, తదితరులు

వేముల : వైఎస్సార్ జిల్లా వేముల, వేంపల్లె మండలాల్లో మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు 2 గంటల పాటు గాలివాన బీభత్సం సృష్టించింది. గాలుల ధాటికి విద్యుత్ స్థంభాలు, చెట్లు నేలకొరిగాయి. మండల వ్యాప్తంగా పత్తిపంట దెబ్బతింది. మండలంలో 4వేల ఎకరాల్లో వేసవి పంటగా రైతులు పత్తి సాగు చేశారు. గాలివానతో కాయలతో ఉన్న పత్తి పంట బలమైన గాలులకు నేలవాలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్థంభాలు, నేలకూలడంతో రాత్రి నుంచి మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వి.కొత్తపల్లె గ్రామానికి చెందిన రెడ్డమ్మ నివాసం ఉంటున్న ఇంటి పైకప్పు రేకులు లేచిపోయింది. మండల వ్యాప్తంగా 4సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అరటి పంట నేలమట్టం

వేంపల్లె : బక్కన్నగారిపల్లె, గిడ్డంగివారిపల్లె, టి.వెలమవారిపల్లె గ్రామాల్లో సుమారు 220హెక్టార్లలో అరటి పంట దెబ్బతిందని హెచ్ఓ రెడ్డయ్య పేర్కొన్నారు. మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలుల వర్షానికి 185మంది రైతుల అరటి పంట నేలవాలింది. దీంతో దాదాపు రూ.5కోట్ల మేర పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్కో ఎకరాకు రూ.80వేల నుంచి లక్ష రూపాయలు ఖర్చు చేశామని రైతులు వాపోతున్నారు.ప్రభుత్వం తమను ఆదుకుని నష్టపరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.